సాక్షి కర్నూలు

సోమవారం | 9 | డిసెంబర్ | 2024



శ్రీశైల దేవస్థానానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి ఆది వారం రాజమహేంద్రవరం నరసింహామూర్తి రూ. 1,01,116, గోసంరక్షణ నిధికి నల్గొండ నారాయణ వర్మ రూ.1,00,116 విరాళం అందజేశారు.



అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథంలో భాగంగా ఆది వారం శ్రీశైల దేవస్థానం ఏర్పాటు చేసిన కార్య క్రమంలో హైదరాబాద్ నటరాజ కూచిపూడి కళాని లయం వారు సంప్రదాయ నృత్యంతో అలరించారు



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.46
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 92.060
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 4,070
అవుట్ ఫ్లో	: 5,133

న్యూస్‌రీల్

శ్రీ మఠంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామి మూలబృందావనం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం పీఠాధిపతి శ్రీ సుబు ధేంద్రతీర్థుల ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సెలవుదినం కావడంతో స్వామి వారిని దర్శించుకు నేందుకు తెలుగురా ష్ట్రాలతోపాటు కర్ణా టక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముం దుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరిం చి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, గజ, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాలపై కొలువుంచి భక్త జన వాహిని మధ్య శ్రీ మఠం మాఢ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీ మఠం అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలి పారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అంద జేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నా మని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


అగ్రానమీ ఏడీఏగా అరుణకుమారి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం (డీఏఓ) అగ్రానమీ ఏడీఏగా కె.అ రుణకుమారి నియమితులయ్యారు. ఆదోని సబ్ డివిజన్ ఏడీఏగా పనిచేస్తున్న ఈమెను ఆన్‌డ్యూ టీపై అగ్రానమీ ఏడీఏగా బదిలీ చేస్తూ వ్యవ సాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం లో అగ్రానమీ ఏడీఏగా పనిచేస్తున్న బాలవర్ధిరా జును ఆన్‌డ్యూటీపై ఆదోని ఏడీఏగా బదిలీ చేశారు. ఈ బదిలీలు పరస్పర అంగీకారంపై జరి గాయి. అగ్రానమీ ఏడీఏగా అరుణకుమారి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించే అవ కాశమున్నట్లు తెలుస్తోంది.

పేద విద్యార్థులకు ఎల్ఐసీ స్కాలర్‌షిప్

కర్నూలు(అగ్రికల్చర్): ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఎల్ఐసీ గోల్డెన్ జుబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్-2024 ప్రారం భించింది. ఈ స్కాలర్‌షిప్ కింద చెల్లించే మొత్తా న్ని కూడా గణనీయంగా పెంచింది. 2021-22, 2022-23, 2023-24 సంవత్సరాల్లో 10వ తరగ తి, ఇంటర్ (12వ తరగతి) / డిప్లొమ, తత్సమా నమైన పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులతో పాస్ అయిన వారు అర్హులు. 2024-25లో మొదటి సంవత్సరం అడ్మిషన్ తీసుకున్న విద్యా ర్థులకు జాతీయస్థాయి ప్రాతిపదికపై స్కాలర్‌షిప్ లభిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. మెడి సిన్ విద్యార్థులకు ఏటా రూ.40 వేలు, ఇంజినీరిం గ్ విద్యార్థులకు రూ.30 వేలు, డిగ్రీ, ఐటీఐ కోర్సు లకు రూ.20 వేల ప్రకారం ఇస్తారని పూర్తి వివ రాలు, దరఖాస్తు కోసం https://licindia.in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

కోతకు పచ్చ జెండా



- పింఛన్ల ఏరివేతకు కూటమి ప్రభుత్వం శ్రీకారం
- మొదటి విడతగా నేడు ఎరుకల చెర్వు, కానాలలో తనిఖీలు
- గజిటెడ్ అధికారి నేతృత్వంలో ఒక్కో గ్రామానికి 10 టీమ్‌లు
- రెండవ విడతలో మొత్తం పింఛన్ల తనిఖీలు చేపట్టేందుకు చర్యలు
- ఆందోళనలో లబ్ధిదారులు
- ఇప్పటికే 10,453 పింఛన్ల తొలగింపు

'నీవు చనిపోయావు.. బతికున్నట్లు సర్టిఫికెట్లు తెచ్చుకుంటే పింఛన్ ఇస్తాం'.. అంటూ పేదలను వేధించిన సంఘటనలు చంద్రబాబు పాలనలో చూశాం. మళ్లీ ఇప్పుడు అలాంటి పరిస్థితే రానుంది. ఎన్నో ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వారికి 'అర్హత లేదు.. ఉంటే నిరూపించుకో' అంటూ కూటమి ప్రభుత్వంలో ఎదురవబో తుంది. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలో గుట్టుగా పది వేల పింఛన్లు తొలగించిన సర్కారు కోతకు మరింత పదును పెట్టిం ది. ఇంటింటినీ తనిఖీ చేసి అనర్హత ముద్ర వేసి తొలగించేందుకు రంగం సిద్ధం చేయడంతో లబ్ధిదారుల ఆందోళన అంతా ఇంతా కాదు. పింఛన్ ఉంటుందో.. ఉండదోననే భయం వెంటాడుతోంది.

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ముందు సంక్షేమ పథకాలతో ఊరించిన చంద్రబాబు నాయుడు అధికా రంలోకి వచ్చిన తర్వాత అన్నింటినీ విస్మరిస్తున్నారు. అందరూ ఊహించినట్లుగా పింఛన్లను పెద్ద ఎత్తున ఏరివేతకు కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో 50 ఏళ్లు నిండిన వారం దరికీ వృద్ధాప్య పింఛన్‌లు మంజూరు చేస్తామని ప్రక టించారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవు తున్నా ఇంతవరకు కొత్త పింఛన్ ఒక్కటీ ఇవ్వకపో గా... ప్రతి నెల పింఛన్లను గుట్టుచప్పుడు కాకుండా తొలగిస్తోంది. తాజాగా బహిరంగంగానే పింఛన్‌ల ఏరివేత చేపడుతోంది. పింఛన్ల ఏరివేతలో భాగంగా తనిఖీలు చేపట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. మొదటి దశలో ప్రతి జిల్లాలో ఒక సచివాలయాన్ని ఎంపిక చేసి అక్కడ మొత్తం పింఛన్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 9న పింఛన్‌ల తనిఖీ కార్యక్రమం జరుగనుంది. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి మండలం ఎరుకల చెర్వు గ్రామంలో, నంద్యాల జిల్లా నంద్యాల మండలం కానాల-2 సచివాలయంలో పింఛన్‌ల పరిశీలన చేప ట్టనున్నారు. ఎరుకల చెర్వులో 349, కానాల సచివా లయం 2 పరిధిలో 420 పింఛన్లు ఉన్నాయి. వీటిని తనిఖీ నిర్వహించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి పింఛన్‌ను పరిశీలించి మొబైల్ యాప్‌లోని ప్రశ్నలకు జవాబులు నమోదు చేయను న్నారు. దగ్గరి మండలాలకు గజిటెడ్ అధికారులు, సచివాలయ సెక్రటరీలో 10 టీమ్‌లు ఏర్పాటు అయ్యాయి. టీమ్‌కు గజిటెడ్ అధికారి ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ నేతృత్వం వహిస్తారు. టీమ్‌లో గజిటెడ్ అధికారితో పాటు సచివాలయ సెక్రటరీ ఉంటారు.

అధికారులు ఇలా తనిఖీ చేస్తారు..

- తనిఖీల్లో ప్రధానంగా ప్రభుత్వం వికలాంగులు, వితుంతు పింఛన్‌లపై ఫోకస్ పెట్టనున్నారు.
- పింఛన్‌దారుల్లో అన్ని కేటగిరీలకు సంబంధించి ఆ కుటుంబంలో ఎవరైనా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారా?
- అర్బన్ ప్రాంతాల్లో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువ నిర్మాణం ఉందా?
- సరాసరి (12నెలలు) విద్యుత్ వినియోగం మొత్తం 300 యూనిట్ల కంటే ఎక్కువ ఉందా?
- లబ్ధిదారుడి కుటుంబంలో ఎవరికైనా 4 చక్రాల వాహనం (టాక్సీ, ట్రాక్టరు, ఆటో మినహా) ఉందా?
- 3 ఎకరాల కంటే ఎక్కువ మాగాణి, 10 ఎకరాల కంటే ఎక్కువ మెట్ట, రెండు కలిపి 10 ఎకరాల కంటే ఎక్కువ ఉందా?
- కుటుంబంలో కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లేదా ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగి లేదా పెన్ష నర్ ఉన్నారా?
- మీ కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా.. వంటి ప్రశ్నలకు జవాబులు రాబట్టనున్నారు.
- ప్రయివేటు సంస్థల్లో తక్కువ వేతనానికి పని చేస్తున్నా పింఛన్ పోయినట్టే.
- వికలాంగులకు సంబంధించి వికలత్వం కలిగి ఉన్నారా... పింఛన్‌దారుని (రీ అసెస్‌మెంటు) వైద్య పరీక్షకు సిఫారసు చేస్తున్నారా.. అనే ప్రశ్నలు ప్రత్యేకంగా ఉన్నాయి.
- వితంతువు, ఒంటరి మహిళలకు సంబంధించి పునర్వివాహం చేసుకున్నారా... అనే ప్రశ్న ప్రత్యే కంగా ఉంది.
- వృత్తి పరమైన పింఛన్లకు సంబంధించి సంబం ధిత వృత్తిలో ఉన్నారా అనే ప్రశ్న ఉంది.
- వివరాలు తనిఖీ చేసిన పింఛన్‌దారుల నుంచి యాప్‌లో బయోమెట్రిక్ తీసుకుంటారు.

డిసెంబరు నెలలో ఉమ్మడి జిల్లా పింఛన్ల వివరాలు

పింఛన్లు	కర్నూలు	నంద్యాల
మొత్తం	2,40,330	2,16,606

ఒక్కరోజులోనే తనిఖీ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది.

రెండో విడతలో మొత్తం పింఛన్ల తనిఖీలు

మొదటి విడతో పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకో సచివాలయంలో తనిఖీలు చేపడుతున్న కూటమి ప్రభుత్వం.. రెండవ దశలో మొత్తం పింఛన్ల తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద చేపడు తున్న తనిఖీల్లో వెలుగు చూసే అంశాలను బట్టి తదుపరి చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. డిసెంబరు నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,56,936 పింఛన్లు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో 2,40,330, నంద్యాల జిల్లాలో 2,16,606 పింఛన్లు ఉన్నాయి. ఒక్కో జిల్లాలో అనర్హత పేరుతో కనీసం 50 వేల పింఛన్లు ఏరివేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్సా ర్‌సీపీ ప్రభుత్వం అర్హతనే ప్రామాణికంగా పింఛన్‌లు మంజూరు చేసింది. ఏడాదిలో రెండుసార్లు కొత్త పిం ఛన్లు మంజూరు చేసింది. పింఛన్‌ల భారాన్ని తగ్గిం చుకునేందుకు కూటమి ప్రభుత్వం పింఛన్‌దారుల్లో అనర్హులున్నారని జూన్ మాసం నుంచి ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారాన్ని నేడు కార్యరూపంలోకి తెచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది జూన్ నెల నుంచి డిసెంబరు వరకు పింఛన్‌లను అడ్డుగో లుగా తొలగించింది. 10,453 పింఛన్‌లను గుట్టుచ ప్పుడు కాకుండా తీసివేసింది.

రాజకీయ కారణాలతో పింఛన్లు తొలగిస్తే ఉద్యమిస్తాం



రాజకీయ కారణాలతో పింఛ న్లను తొలగిస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తాం. అనర్హత పేరుతో అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్న ఇంతవరకు ఒక్క కొత్త పింఛన్ ఇవ్వకపో వడం అన్యాయం. రాజకీయ కారణాలతో తొలగిం చరాదు. పింఛన్ల తనిఖీతో పాటు పింఛన్లకు అర్హు లైన వారిని కూడా గుర్తించాలి. కొత్త పింఛన్లు కూడా మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. వేలాది మంది పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

– ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సీపీఎం

ఒక్క రోజులోనే తనిఖీలు

పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలో ఒక సచివాలయం పరిధిలో ఉన్న మొత్తం పింఛన్‌లను తనిఖీ చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో కృష్ణగిరి మండలం ఎరుకల చెర్వు గ్రామంలో సోమవారం తనిఖీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. ఎరుకల చెర్వులు 349 అన్ని రకాల పింఛన్‌లు ఉన్నాయి. ప్రతి పింఛన్ పరిశీలిస్తారు. తనిఖీలకు కర్నూలు, కల్లూరు మండలాల నుంచి ఏపీడీవోలు, ఈవోఆర్ డీలు సచివాలయ సెక్రటరీలతో 10 టీమ్‌లు ఏర్పాటు చేశాం. ఒక్క రోజులోనే తనిఖీల ప్రక్రియ పూర్తి చేయాలి. మొబైల్ యాప్‌లోనే తనిఖీ వివ రాలు నమోదు చేస్తారు.

– నాగశివలీల, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

ఏరివేత తర్వాతే కొత్తవి..

పింఛన్ల ఏరివేత తర్వాతనే కొత్తవి ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టమవుతోంది. తనిఖీల్లో భాగంగా ఎన్ని పోతాయనే దానిని బట్టి కొత్త పింఛన్లు అన్ని ఇవ్వాలనే ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం పై ఎలాంటి అదనపు ఆర్థిక భారం పడకుండా పింఛన్ల ఏరివేతకు చర్యలు చేపట్టింది. ఆరు నెలలుగా కొత్త పింఛన్ ఒక్కటీ కూడా ఇవ్వలేదు. కనీసం దరఖాస్తు ఆన్‌లైన్ చేయడా నికి కూడా ఆప్షన్ ఇవ్వలేదు. కొత్త పింఛన్లు లేకపోగా.. భారీగా తొలగింపులకు శ్రీకారం చుట్టడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది. పింఛన్ ఏరివేత చేపడుతుండటంతో సీఎం చంద్రబాబు నాయుడు నైజం బయటపడిం దనే విమర్శలు వ్యక్తం అవుతున్నారు.



వైభవంగా ప్రభోత్సవం

బల్లేకల్ గ్రామం కార్తీకమాసం ముగింపు ఉత్సవాలకు ప్రత్యేకం. మూడు రోజుల పాటు పండుగలా నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భం గా గ్రామంలో వెలిసిన శ్రీ వేంకటేశ్వ రస్వామి (తిమ్మప్పస్వామి), పద్మావతి (అలివేలు మంగమ్మ) ఉత్సవాలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శని వారం రాత్రి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల ఉచ్చాయం (ప్రభోత్సవం) ఆదివారం ఉదయం వరకు కొనసా గింది. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్య సమర్పణ, నం దికోల సేవ నిర్వహించారు. భక్తుల కోలాటలు, సాంస్కృతిక కార్యక్ర మాలు చూపరులను అలరించాయి.

– ఆదోని రూరల్

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఇంజినీరింగ్ అధికారులతో శ్రీశైలం ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఈఓ ఎం. శ్రీనివాసరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన దేవస్థానంలో జరు గుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ ఆలయప్రాంగణంలోని బండపరు పునకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. జనవ రిలో జరిగే మకరసంక్రాంతి బ్రహ్మోత్సవాలలోపు అక్కమహాదేవి అలంకార మండప నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మండపం లోని వేదికను ఆలయ సంస్కృతి ప్రతిబింబించే విధం గా కళాత్మకంగా తీర్చిదిద్దాలన్నారు. అలాగే అమ్మవారి ఆలయంలోని రుధిరగుండానికి అవసర మైన మరమ్మతులు చేపట్టాలన్నారు. ప్రాచీన నిర్మా ణాలకు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించారు. అనంతరం మల్లమ్మ మందిరం , గోసంరక్షణశాలను ఈఓ పరిశీలించారు. మల్లమ్మ మందిరం క్యూలైన్లలోని బండపరుపునకు మరమ్మతులు చేసి, ఉద్యానవనాన్ని మరింతగా సుందరీకరించాలన్నారు.

సమస్యల సాధనకు ఆందోళన బాట



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ కార్మికులు

ఎమ్మిగనూరుటౌన్: మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం లో పనిచేసే కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారు. ఆదివారం పట్టణం లో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్, బస్టాండ్ రోడ్డు మీదుగా శివ సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్ వరకు నిర్వహించారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడ నిరవధిక దీక్ష చేపట్టారు. ఏపీ మున్సి పల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నారాయణ, శివరామకృష్ణ,నరసప్ప మాట్లాడారు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాల సర్వీసు ఉన్న కార్మి కులను క్రమబద్ధీకరించాలని, జాతీయ, రాష్ట్ర పండు గలకు సెలవులుగా ప్రకటించాలని లేదా వేతన దినా లుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్ర కుమార్, హంసరాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మ వార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా శ్రీగిరి చేరుకున్నారు. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించి భక్తులు మల్లన్నను దర్శించుకున్నారు..

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నిధుల రగడ

- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై 'రచ్చ'
- సర్పంచులను దొంగలుగా చిత్రీకరించడంపై తీవ్ర ఆగ్రహం
- ఆదోని ఎమ్మెల్యే విమర్శలను తిప్పికొట్టిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు
- మెజార్టీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల గైర్హాజరు
- రూ.65.91 కోట్లతో 5924 పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు రంజిత్‌బాషా, రాజకుమారి, జేసీ నవ్య



ఆదోని ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు

కర్నూలు(అర్బన్): 'దొంగలు దొంగలు ఊర్లు పం చుకున్నట్లు గ్రామాల్లో సర్పంచులు 15వ ఆర్థిక సం ఘం నిధులను పంచుకుంటున్నా'రని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి చేసిన వ్యాఖ్యలపై జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో దుమారం లేచింది. ఆదివారం ఉదయం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో చేసిన పను లకు ప్రస్తుతం విడుదలైన ఆర్థిక సంఘం నిధులను జమ చేసుకోవడం ఏమిటని ఆదోని ఎమ్మెల్యే ప్రశ్నిం చారు. దీంతో మెజార్టీ వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు ఎమ్మెల్యే వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం, అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదోని డివిజన్‌లో ఈ ఆర్థిక సంవత్స రంలో రెండు విడతలుగా రూ.3.52 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని, ఇందులో ఒక్క పైసా కూడా సర్పంచులు గ్రామాభివృద్ధి కోసం వెచ్చిం చడం లేదని ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి ఆరోపిం చారు. దీంతో కొత్తపల్లి, మహానంది జెడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కేవీ మహేశ్వరరెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో గ్రామాభివృద్ధి కోసం చేసిన పనులకు వెచ్చించిన నిధులను ఇప్పుడు తీసుకుంటే అక్రమం ఎలా అవుతుందని నిలదీశారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే పార్థసారధి, జెడ్పీటీసీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి జోక్యం చేసుకుంటే ఎక్కడ నిధులు పక్కదారి పట్టాయో అనే విషయాలను ఆధారాలతో చెబితే సంబంధిత అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని చెప్పారు. అలాగే నిధుల వ్యయంపై ఆడిట్ కూడా జరుగుతుంది కదా ? ఈ నేపథ్యంలోనే... సమావేశాల్లో చర్చించే అంశాలపై ముందుగానే సమాచారం అందిస్తే కొశ్చన్ అవర్‌లో చర్చించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యేలు జయసూర్య, బొగ్గుల దస్తగిరి, గౌరు చరితారెడ్డి, కేఈ శ్యాంకుమార్, కర్నూలు, నం ద్యాల జిల్లాల కలెక్టర్లు పీ రంజిత్‌బాషా, రాజకుమారి గణియా, కర్నూలు జేసీ డా.బీ నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బా రెడ్డి, కురువ, వాల్మీకి కార్పొరేషన్ల చైర్మన్లు మాన్వి దేవేంద్రప్ప, కప్పట్రాళ్ల బొజ్జమ్మ హాజరయ్యారు.

40 శాతం లెస్ టెండర్లపై విచారణ జరిపించండి.. మంత్రి టీజీ భరత్

సీసీడబ్ల్యూఎస్ అమలుకు సంబంధించినన టెండర్లలో కాంట్రాక్టర్లు 40 శాతం లెస్‌కు టెండర్లు వేశారని నం దికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆరోపించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ స్పందిస్తూ.. 30 నుం చి 40 శాతం తక్కువ కోట్ చేస్తే ఆయా పనులను ఎం త నాణ్యతతో చేస్తారని ప్రశ్నించారు. రెండు నెలల నుంచి ఎమ్మెల్యే ఈ అంశంపై అడుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఈ లెస్ టెండర్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీ నాగే శ్వరరావును ఆదేశించారు. అలాగే ఎమ్మెల్యే పార్థసా రధి లేవనెత్తిన ఆదోని మండలం సాంబగల్లు గ్రామం లో కుళాయి పైపుల్లోకి మురుగునీరు వస్తున్న సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

మెజార్టీ ప్రజా ప్రతినిధుల గైర్హాజర్

ప్రతి 90 రోజులకు ఒకసారి ప్రజా సమస్యలపై చర్చిం చి వాటికి పరిష్కార మార్గాలను చూపే వేదిక అయిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మం త్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రుల్లో టీజీ భరత్ మినహా ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, బాలనాగి రెడ్డి, విరూపాక్షి, కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, భూమా అఖిలప్రియతో పాటు ఎమ్మె ల్సీలు గైర్హాజరయ్యారు.

5,924 పనులకు ఆమోదం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్ట నున్న రూ.65.91 కోట్ల విలువ చేసే 5,924 పనులకు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమోదం తెలిపిం ది. ఆవులు, మేకలు, గొర్రెల, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలు, గ్రామీణ అవసరాలు, కనెక్టివిటీ, పారిశుధ్యం తదితర పనులను ఈ నిధులతో చేపట్టనున్నారు. కర్నూలు జిల్లాలో మొత్తం రూ.39,87,18,903లతో 1746 పనులకు, నంద్యా ల జిల్లాలో మొత్తం రూ.26,04,71,143తో 4178 పనులను చేపట్టేందుకు ఆమోదం తీసుకున్నారు.

జెడ్పీ సమావేశాల్లో ఎవరేమన్నారంటే....

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆర్‌డబ్ల్యూ ఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ శాఖలపై జరిగిన సమీక్షలు పలు వురు సభ్యులు తమ పరిధిలోని సమస్యలను లేవ నెత్తారు.

- జేజేఎం స్కీం పొడిగించే అవకాశం ఉన్నందున ముందుగా డీపీఆర్‌లు సిద్ధం చేసుకుంటే అనుమ తులు వచ్చిన వెంటనే పనులు చేపట్టేందుకు అవ కాశం ఉంటుంది... – ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- ఆస్పరి మంచి నీటి పథకం డిజైన్‌లో లేని గ్రామాలకు నీరు అందించడం వల్ల డిజైన్‌లో ఉన్న గ్రామాలు నీరు లేక అల్లాడిపోతున్నారు.. – దొరబాబు, ఆస్పరి జెడ్పీటీసీ
- పొలం వివాదం వల్ల ఆగిపోయిన కోడుమూరు – గూడూరు రోడ్డు పనులను వెం టనే పూర్తి చేయండి .. – టీ రఘునాథరెడ్డి, కోడుమూరు జెడ్పీటీసీ
- మండలంలోని కే వెంకటాపురం గ్రామంలో నెలకొన్న తీవ్ర మంచి నీటి ఎద్దడిని నివారిం చండి .. – రామక్రిష్ణ, దేవనకొండ జెడ్పీటీసీ
- రైల్వే లైను కారణంగా గాజులపల్లె గ్రామ సమీ పంలోని 300 ఎకరాలకు విద్యుత్ సరఫరా ఇచ్చే విధంగా చర్యలు చేపట్టండి.. – కేవీ మహేశ్వరరెడ్డి, మహానంది జెడ్పీటీసీ
- కొత్తపల్లి మండలం చిన్న గుమ్మడాపురం గ్రామానికి వెళ్లే దారిలోని పొలాల్లో విద్యుత్ స్తం భాలు ఒరిగిపోయాయయని, దీని ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి... – సుధాకర్‌రెడ్డి, కొత్తపల్లి జెడ్పీటీసీ

ఆ మద్యం షాపు తీసేయండి

బ్రాహ్మణకొట్కూరులో జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం షాపుతో అనేక ఇబ్బందులు ఎదురవుతు న్నాయని నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ షేక్ కరీమున్నీసా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా ర్థులు ఇటీవల మద్యం తాగి స్కూల్‌కు వచ్చిన విషయాన్ని హెచ్‌ఎం గుర్తించారన్నారు. ప్రభుత్వ నిబం ధనల ప్రకారం బడి, గుడికి సమీపంలో మద్యం షాపు లను ఏర్పాటు చేయరాదని చెబుతుండగా నందికొ ట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అడ్డుతగలడంతో వారి మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి నం ద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా జోక్యం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపు ఏర్పాటు చేసి ఉంటే విచారించి చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

విధులు ముగించుకుని వెళుతూ ఉపాధ్యాయుడి మృతి


మృతిచెందిన విజయభాస్కర్

డోన్: మండలంలోని యూ.కొత్తపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ భాస్కర్ శనివారం సాయంత్రం కర్నూలు రైల్వేస్టేషన్ వద్ద గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఉదయం పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో బిజీగా గడిపి తన స్వస్థలమైన కర్నూలుకు రైల్లో వెళ్లాడు. రైల్వేస్టేషన్‌లో దిగి ఇంటికి వెళుతూ స్టేషన్ బయట గుండెపోటుతో కుప్పకూలిపోయాడని సహచర ఉపాధ్యాయులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారులు ఉన్నారు. విజయభాస్కర్ ఆకస్మిక మృతి పట్ల కొత్తపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కేసీలో తగ్గిన నీటి సరఫరా


కేసీ కాల్వలో ప్రవహిస్తున్న నీరు

జూపాడుబంగ్లా: సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,750 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఎగువ ప్రాంతాల నుంచి సుంకేసుల డ్యాంలోకి నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. డ్యాంలో 1.2 టీఎంసీల నీటిమట్టం ఉండగా కేసీ కాల్వకు 1,750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగం అనంతరం లాకిన్స్‌లాకు 1,460 క్యూసెక్కుల నీరు చేరుతుందని చెప్పారు. ఈ నీటిని నిప్పులవాగుకు 1,050 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 205, అలగనూరు రిజర్వాయర్ కాల్వకు 205 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

హిజ్రాల మధ్య వాగ్వాదం


ఘటనా స్థలంలో హిజ్రాలు

బేతంచెర్ల: స్థానిక కొత్త బస్టాండు సమీపాన ఆదివారం సీనియర్, జూనియర్ హిజ్రాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నంద్యాల, పాణ్యం, బేతంచెర్ల మండలాలకు చెందిన హిజ్రాలందరూ ఒక్కచోట పోగై వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో సమస్య సద్దుమణిగింది. సీనియర్ హిజ్రాలకు జూనియర్లు మర్యాద ఇవ్వకపోవడంతోపాటు, గతంలో జరిగిన సంఘటనల వల్ల వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడిన విష్ణువర్ధన్‌రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలో జాతీయ రహదారి-44పై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కర్నూలులోని వెంకటరమణ కాలనీకి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్ ఆదివారం సాయంత్రం డోన్ నుంచి కర్నూలుకు వెళుతుండగా వెల్దుర్తి సమీపంలో వీరు వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. రహదారిపై వెళుతున్న ప్రయాణికులు 108కు ఫోన్ చేసి సమాచారం అందించారు. అంబులెన్స్ వాహనం ఘటనా స్థలానికి చేరుకోగా క్షతగాత్రులను కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది ఉస్మాన్ బాషా, ఖాదర్‌బాషా తెలిపారు.

రక్షణ సగమే!

- ఆదోని డివిజన్ పోలీస్‌స్టేషన్లలో సగం పోస్టుల ఖాళీ
- 332 మందికి గానూ విధుల్లో ఉన్నది 169 మందే..
- సిబ్బంది కొరతతో కేసుల పెండింగ్
- పెరుగుతున్న నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు
- ఈ ఏడాది 686 కేసుల్లో ఛేదించినవి 151
- విచారణలో ఉన్నవి - 181 పెండింగ్ కేసులు - 392


ఆదోని డీఎస్పీ కార్యాలయం

ఆదోని అర్బన్: కనీసం క్లూ కూడా లభించని సంచలనాత్మక కేసులను 24 గంటల్లోపు ఛేదించడం, నేరాల నియంత్రణకు పక్కా ప్రణాళికతో ముందడుగు వేయడంలో పోలీసు శాఖకు పెట్టింది పేరు. అలాంటి కేసులు ఛేదించాలన్నా, ప్రజలకు రక్షణ కల్పించాలన్నా జనాభాకు తగ్గట్టు ఆయా పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది, అధికారులు ఉండాలి. అయితే ఆదోని నియోజకవర్గంలో ఏడు పోలీస్‌స్టేషన్లతో పాటు ఒక కంట్రోల్ రూం ఉంది. మొత్తం 332 మంది పోలీసులు పనిచేయాల్సి ఉండగా, కేవలం 169 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఏడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో మట్కా, గుట్కా, నాటుసారా, కర్ణాటక మద్యం విక్రయాలు, బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. పోలీసు సిబ్బంది తగినంతగా లేకపోవడంతో నేరగాళ్ల ఆటలు సాగుతున్నాయి. అంతేగాక కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏళ్ల తరబడి కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. చోరీ కేసులను సైతం ఏళ్ల తరబడి పోలీసులు ఛేదించలేకపోతున్నారు.

➤ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అధికారితో పాటు 60 మంది పోలీసు సిబ్బంది ఉండాల్సి ఉంది. కేవలం 35 మంది మాత్రమే ఉన్నారు. ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 43 పీసీలు, ఐదు మంది మహిళా పోలీసులు ఉండాలి. అయితే ఒక సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 29 మంది పోలీసులు కలిపి 35 మంది ఉన్నారు. సగానికి సగం మంది మాత్రమే ఉండడంతో విధులకు న్యాయం చేయలేకపోతున్నారు.

➤ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 61 మందికి గాను 33 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో అసాంఘిక శక్తులను సమర్థవంతంగా అడ్డుకోలేకపోతున్నారు. ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఎనిమిది మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 43 మంది పోలీసులు, ఆరు మంది మహిళా పోలీసులు ఉండాలి. అయితే ఒక సీఐ, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 29 మంది పోలీసు కానిస్టేబుళ్లు మాత్రమే పనిచేస్తున్నారు.

➤ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 56 మందికిగాను 27 మంది పోలీసులు పనిచేస్తున్నారు. ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 43 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా, ఒక సీఐ, ఏడుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 16 మంది పోలీసులు, ముగ్గురు మహిళా పోలీసులతో పాటు కలిసి మొత్తం 27 మంది మాత్రమే ఉన్నారు. పోలీసుల కొరత వల్ల కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

➤ తాలూకా(రూరల్) పోలీస్‌స్టేషన్‌లో 32 మందికి గాను 19 మంది పోలీసులు మాత్రమే ఉన్నారు.

➤ ఆదోని మండలంలో 42 గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల పరిధిలో రూరల్ పోలీస్‌స్టేషన్ కింద ఇస్వీ, పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి.

ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో 28 మందికిగాను 18 మంది పోలీసులు ఉన్నారు. ఒక ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 21 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా, ఎస్‌ఐ, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 11 మంది కానిస్టేబుళ్లు, ఒక మహిళా పోలీసు ఉన్నారు.

➤ పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ పరిధిలో 28 మంది ఉండాల్సి ఉండగా కేవలం 16 మంది మాత్రమే ఉన్నారు. ఒక ఎస్‌ఐతో పాటు ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 21 మంది పోలీసులకుగాను ఒక ఎస్‌ఐతో పాటు ఇద్దరు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 9 మంది పోలీసులు ఉన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో డీవోలు వేయించుకుని అప్పుడప్పుడు ఎస్‌ఐతో పాటు పోలీసులు వస్తూ వెళ్తుంటారు.

➤ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో 50 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా, 21 మంది మాత్రమే ఉన్నారు. ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు, ఆరు మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 43 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా, ఒక సీఐ, ఎస్‌ఐ, ఇద్దరు ఏఎస్‌ఐలు, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 13 మంది పోలీసులు ఉన్నారు. ఇలా సగానికి సగం సిబ్బంది కొరత ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రోడ్లు వెడల్పు లేకపోవడంతో ఒక్క వాహనం నిలబడితే అంతే సంగతులు. ట్రాఫిక్ జామ్ అవుతోంది. ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు జరిగితే ట్రాఫిక్ చిక్కులు తప్పవు.

☛ ఆదోని శివారు భరత్‌నగర్‌లో ఉంటున్న రామకృష్ణమ్మ గత జనవరిలో 24 గ్రాముల బంగారు నెక్లెస్, కమ్మలను మెరుగు పెట్టేందుకు స్థానిక బంగారు బజార్‌లోని ఓ షాపులో ఇచ్చింది. రూ.3 వేలు బిల్లు కూడా చెల్లించింది. దుకాణదారుడు నగలతో పరారుకావడంతో బాధిత మహిళ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా అప్పుడున్న సీఐ తేజమూర్తి కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఆమె పోలీస్‌స్టేషన్, సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉంది. నెక్లెస్, కమ్మలను తీసుకొని కాపురానికి రావాలని భర్త తేల్చిచెప్పడంతో చేసేది లేక పుట్టింట్లోనే ఉండిపోయింది. పోలీసులు దొంగను పట్టుకొని సొత్తు అప్పగిస్తారని ఆశగా ఎదురు చూస్తోంది.

☛ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకేరోజు ఐదుగురు ఉపాధ్యాయుల ఇళ్లలో చోరీ జరిగింది. గతేడాది మే నెలలో దొంగతనం జరగ్గా ఇప్పటివరకు పోలీసులు కేసును ఛేదించలేకపోయారు. ఆర్టీసీ కాలనీలోని రమేష్‌నాయుడు ఇంట్లో ఆరు తులాల బంగారం, సుధాకర్ ఇంట్లో ఒకటిన్నర తులం బంగారం, విద్యుత్‌శాఖ అధికారి నాయక్ ఇంట్లో రూ.30 వేలు నగదు, 15 తులాల వెండి చోరీ జరిగినా దొంగల ఆచూకీ నేటి వరకు లభించలేదు. ఆ కాలనీలో మరికొన్ని ఇళ్లల్లో కూడా చోరీలు జరిగాయి.

ప్రత్యేక కార్యక్రమాలు ఉంటే అంతే..

ఉత్సవాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, బ్రహ్మోత్సవాలు, దేవరలు, రథోత్సవాలు తదితర కార్యక్రమాలకు బందోబస్తు ఎంతో అవసరం. ఎలాంటి ప్రమాదాలు, నేరాలు, అసాంఘిక చర్యలు జరగకుండా బందోబస్తు చేపట్టాలి. అలాంటి సమయంలో పట్టణంలోని పోలీస్‌స్టేషన్లన్నీ ఖాళీగా ఉంటాయి. కొన్ని సమయాల్లో ఇన్వెస్టిగేషన్ కోసం, కేసు ఛేధన కోసం బృందాలుగా ఏర్పడినప్పుడు సిబ్బంది కొరత వేధిస్తోంది.

నత్తనడకన కేసుల ఛేదన

ఆదోని నియోజకవర్గంలోని ఏడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ యేడాది జనవరి నుంచి నవంబర్ వరకు 686 కేసులు నమోదయ్యాయి. అందులో 151 కేసులను మాత్రమే పోలీసులు ఛేదించారు. 392 కేసులు పెండింగ్‌లో ఉండిపోయాయి. అందులో 181 కేసులు విచారణ దశలో ఉన్నాయి. సిబ్బంది కొరత వల్ల విచారణ చేపట్టలేకపోవడంతో కేసులు పెండింగ్‌లో పడి ఉన్నతాధికారుల ఒత్తిడికి గురిగాక తప్పడం లేదు.

10 నుంచి 20 ఏళ్లుగా ఒకేచోట విధులు

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐతో పాటు సిబ్బంది దాదాపు 3 - 5 ఏళ్ల పాటు విధులు నిర్వహించాలి. కానీ నియోజకవర్గంలోని ఏడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ, ఏఎస్‌ఐలతో పాటు సిబ్బంది బదిలీ ఉత్తర్వులు వచ్చినా నియోజకవర్గంలోనే చుట్టూ తిరుగుతుంటారు. కొందరు ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు, సిబ్బంది 10 నుంచి 20 సంవత్సరాలుగా నియోజకవర్గంలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డీవోలు గానీ పోస్టింగ్‌లు వేయించుకుంటున్నారు. కొంతమంది సిబ్బంది వేరే ప్రదేశాల నుంచి వస్తుంటారు. ఏళ్ల తరబడి వారే పోలీస్‌స్టేషన్లలో ఉండడంతో అసాంఘిక శక్తులతో సాన్నిహిత్యంగా ఉంటూ నేరాల నియంత్రణను గాలికొదిలేస్తున్నారు.

పెండింగ్ కేసులు పెరిగాయి



నియోజకవర్గంలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రస్థాయిలో ఉంది. సగానికి సగం కొరతతో అధికారులకు ఇబ్బందులు ఉన్నాయి. దీంతో కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఒత్తిడి పెరుగుతోంది. త్వరలో పోలీసు రిక్రూట్‌మెంట్ జరుగుతుంది. ఏళ్ల తరబడి ఆయా పోలీస్‌స్టేషన్‌లలో సిబ్బంది అతుక్కుపోయారు. వీరి నుంచి కొంత మంచి ఉంది, కొంత చెడు కూడా ఉంది. వీరిని పంపితే ఇక్కడ వచ్చేవారు లేరు.

– సోమన్న, ఆదోని డీఎస్పీ

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

- రెండు తులాల బంగారం అపహరణ


ఇంట్లో బీరువాను పగులగొట్టిన దృశ్యం

గోనెగండ్ల: మండల కేంద్రంలోని కురువపేటకు చెందిన బోయ రంగస్వామి ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు వివరాలు.. బోయ రంగస్వామి, భార్య పులకుర్తి ఈరమ్మ దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం కోసం తెలిసిన వారి దగ్గర నగదు అప్పు తీసుకున్నారు. అప్పు తీర్చేందుకు గత నెలలో రంగస్వామి, భార్య, కుమారుడితో కలిసి ఇంటికి తాళం వేసి నల్గొండ జిల్లాకు వలస వెళ్లారు. ఈ స్థితిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాను పగులగొట్టి అందులో ఉన్న బంగారం దొంగలించారు. దీనిపై బోయ రంగస్వామికి అతని అన్న సమాచారం ఇవ్వడంతో ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచిన రెండు తులాల బంగారం చోరీకి గురైనట్లు తెలిసింది. బాధితురాలు ఈరమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోని రూరల్: ఆదోని మండలం బసాపురం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఇస్వీ ఎస్‌ఐ నాగేంద్ర విలేకరులకు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఎరుకుల మునిస్వామి తన స్థలంలో పందులగూడు ఏర్పాటు చేసుకునే విషయంలో కాటే లింగప్ప, జగన్, మారెన్న అనే వ్యక్తులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మాటామాటా పెరిగి అతనిపై దాడి చేశారు. బాధితుడు మునిస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో తిమ్మప్పస్వామికి పూజ నిర్వహించే విషయంలో తాము ముందు పూజ చేయాలని తిమ్మారెడ్డి, మరో వర్గానికి చెందిన కాశీం మాటామాటా పెంచుకుని దాడులు చేసుకున్నారు. ఘటనలో తిమ్మారెడ్డితో పాటు మరో ఇద్దరిపై, మరో వర్గానికి చెందిన కాశీంతో పాటు మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపారు. గతంలో వీరి మధ్య వ్యక్తిగత కక్షలు ఉన్న కారణంగానే ఈ గొడవలు జరిగాయని ఎస్‌ఐ చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం

పగిడ్యాల: విధవరాలి పట్ల అమర్యాదగా ప్రవర్తించిన ఓ వ్యక్తి భయాందోళనకు గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం ఆదివారం రాత్రి లక్ష్మాపురంలో నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. బుడగ జంగాల కాలనీకి చెందిన రాముడు, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దవాడైన రామాంజనేయులు భార్య కొద్ది రోజుల క్రితమే చనిపోగా మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి ఇదే గ్రామానికి చెందిన ఓ విధవరాలి ఇంటి వద్దకు వెళ్లి తలుపులు కొట్టి తొంగిచూశాడు. అప్రమత్తమైన ఆమె అతని ముఖంపై కొట్టి పక్కనే ఉన్న తన ఇద్దరు తమ్ముళ్లు ఉసేనాలం, మస్తాన్‌లకు విషయం చెప్పింది. వారు కోపోద్రిక్తులై రామాంజనేయులును పట్టుకుని చెట్టుకు కట్టేసి కొట్టినట్లు తెలిసింది. అలాగే ఆదివారం బాధితురాలు ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న రామాంజనేయులు భయాందోళనకు గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ముచ్చుమర్రి ఎస్‌ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు దారి తీసిన పరిణామాలపై మృతుని కుటుంబీకులను, గ్రామస్తులను విచారించారు. మృతుడి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శ్రీమఠంలో కర్ణాటక మంత్రి


మంత్రికి మెమెంటో అందజేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామివారిని దర్శించుకునేందుకు కర్ణాటక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి చాలువరాయస్వామి కుటుంబ సమేతంగా ఆదివారం మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం కప్పి, స్వామి వారి మెమెంటో, ఫలమంత్రాక్షింతలిచ్చి ఆశీర్వదించారు. అంతకు ముందు ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఎన్నిక


చైర్మన్ షేక్షావలిరెడ్డి


అధ్యక్షుడు చిన్నపురెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్లు కె.మధుసూదనరావు, కృష్ణమూర్తి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాలాజీ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని గురురాజ స్కూల్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ చైర్మన్‌గా షేక్షావలి రెడ్డి, ప్రెసిడెంట్‌గా చిన్నపురెడ్డి, కార్యదర్శిగా బాలమద్దిలేటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధి కొరకు తమ శాయశక్తుల కృషి చేస్తామని వారు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని పీడీలు, పీఈటీలు అభినందించారు.

శభాష్ శివానీ

- వైకల్యాన్ని జయించి షాట్‌పుట్‌లో స్వర్ణం కైవసం
- తల్లి మృతి చెందినా చెక్కుచెదరని ఆత్మస్థైర్యం


జాతీయ పతాకంతో శివానీ (కుడివైపు)

మద్దికెర: ఆత్మవిశ్వాసం, పట్టుదలతో వైకల్యాన్ని జయించి షాట్‌పుట్ బాట పట్టింది. ఇంతలోనే తల్లి మరణించడంతో జీవితంలో కుదుపు. అయినా బాధను దిగమింగి పది రోజుల్లోనే తిరిగి సాధన మొదలు పెట్టి అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించి శభాష్ అనిపించుకుంది మద్దికెరకు చెందిన శివానీ గ్రామానికి చెందిన హోసూరు ఉప్పర వీరప్ప, లలిత దంపతుల కుమార్తె శివానీ హైదరాబాద్‌లోని గోపనపల్లి నవోదయ స్కూలులో విద్యనభ్యసిస్తోంది. అక్కడ ఆదిత్య మెహతా స్పోర్ట్స్ అకాడమీ ద్వారా పారా అథ్లెటిక్ కోచ్ వేణు వద్ద షాట్‌పుట్‌లో శిక్షణ పొందుతూ అవార్డులు సాధించింది. కుడి చెయ్యి సగం వరకు (మోచేతి వరకు) లేకపోయినా ఆమె చూపిన పట్టుదల, ఆత్మవిశ్వాసం ముందు వైకల్యం తలవంచింది. ఈ ఏడాది అక్టోబర్ 18న తల్లి లలిత మృతి చెందినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా పది రోజుల్లోనే సాధన తిరిగి ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో రాణించింది. థాయిలాండ్‌లో ఈనెల 1 నుంచి 7వతేదీ వరకు జరిగిన ప్రపంచ ఎబిలిటీ స్పోర్ట్స్ యూత్ గేమ్స్–2024 క్రీడల్లో సత్తా చాటింది. ఎఫ్-46 అండర్-20 విభాగం షాట్‌పుట్ ఈవెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడంతో ఆమెను పలువురు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి


కర్నూలు న్యూసిటీ: స్థానిక బళ్లారి చౌరస్తాలోని అమీలియో ఆస్పత్రి వద్ద స్కార్పియో వాహనం ఢీకొని బండారి మధు (44) మృతి చెందాడు. వైన్ షాపులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఆయన శనివారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని మొదట అమీలియో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

డోన్ టౌన్: పట్టణంలోని గుత్తి రోడ్డులో వంద పడకల నూతన ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. డోన్ పట్టణ సమీపంలోని యు.కొత్తపల్లె జాతీయ రహదారి నుంచి నంద్యాల రోడ్డుకు నిర్మిస్తున్న జాతీయ రహదారి-44బీ పనుల కారణంగా ఆసుపత్రి సమీపం నుంచి వ్యవసాయ మార్కెట్ వరకు రోడ్డు ఒక వైపు బ్లాక్ చేసి మరోవైపున వాహనాల రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదం చోటు చేసుకున్నాయి. ఉదయం మడకశిర డిపోకు చెందిన బస్సు పట్టణంలోకి ప్రవేశిస్తుండగా రోడ్డు పనులకు సంబంధించిన టిప్పర్ ఢీకొనడంతో బస్సు దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదు. అలాగే సాయంత్రం అనంతపురానికి చెందిన కొందరు క్రూక్స్ జీపులో డోన్ పట్టణంలోకి వస్తుండగా పట్టణంలోని కొండపేటకు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు బాల సుబ్బయ్య తన కారులో కొత్తపల్లె వైపు వెళుతూ ఢీకొన్నారు.ఈ ప్రమాదంలో అనంతపురానికి చెందిన గోపాలకృష్ణ, ప్రభాకర్, మహిమాకర్, మధుగోపాల్, ఎం.ప్రభాకర్‌తో పాటు డోన్‌కు చెందిన గ్రామీణ వైద్యులు బాలసుబ్బయ్యకు గాయాలయ్యాయి. గాయపడిన వారు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలివెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందడంతో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



ఇలా నిలబెట్టుకున్నారు!

ఫెంగల్ తుపాను రైతులను అతలాకుతలం చేసింది. ముఖ్యంగా కోతల సమయంలో వరి రైతులను నిండాముంచింది. ఎక్కడ చూసినా గాలీవానకు వరిపైరు నేలకొరిగింది. దీంతో రైతులు గింజలు నేలరాలకుండా కూలీలతో వరి దుబ్బులను కట్టలు కట్టించి నిలబెట్టడం ద్వారా పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా చేయడం ద్వారా నష్టం తగ్గుతుందని, కోతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు.

– దొర్నిపాడు



బోరు ఉన్నా సీసీ రోడ్డు నిర్మాణం

మండల పరిధిలోని హెచ్.కొట్టాల గ్రామంలో చౌడేశ్వరీ ఆలయం నుంచి గ్రామ సచివాలయ భవనాల వరకు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే గ్రామ సచివాలయం ముందు ఉన్న బోరును పట్టించుకోకుండా అలాగే సీసీ రోడ్డు వేశారు. రోడ్డు మధ్యలో బోరు ఉండటం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాకుండా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహనాలు ఢీ కొంటే బోరు దెబ్బతినే ముప్పు కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు బోరు చుట్టూ గ్రిల్ ఏర్పాటుచేయాలని, అలాగే సమాంతరంగా గుంతను తవ్వి పైపు లైన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– బేతంచెర్ల



వరినారుకు చీర సొగసు

వరి నారును పందులు, పశువుల నుంచి రక్షించుకునేందుకు రైతులు వినూత్న ప్రయత్నాలు చేస్తున్నారు. సి.బెళగల్లో పలువురు రైతులు నీటిమడులలో వరినారు సాగు చేశారు. నారును పశువుల నుంచి రక్షించుకునేందుకు పాత చీరలు, దోవతీలతో కంచె ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పచ్చని పైరుకు చీర సొగసు అద్దినట్లు కనిపిస్తోంది. కొందరు రైతులు ఇనుప రేకులతో కంచె ఏర్పాటు చేసి నారును రక్షించుకుంటున్నారు.

– సి.బెళగల్